
# చదువుకొన్న నాటుమనిషి

కృష్ణమూర్తి తల్లికి చదువుకొన్న కోడలు రావాలని. కృష్ణమూర్తికి చదువుకున్న భార్యకావాలని. తండ్రిలేని కృష్ణమూర్తిని తానే తల్లి తండ్రి అయి పెంచి పెద్దచేసిన తల్లికోరికా, గారాబంగా పెరిగి యిష్టంవచ్చినట్లూ తిరిగి సంఘంలో సరదాగా వుండడం అంటే ఏమిటో తెలుసుకున్న కృష్ణమూర్తి కోరికా ఒకటే కావడంతో యింక కష్టంఏముందీ? ముసలమ్మగారు లెక్కలేనంత మంది పెళ్ళిళ్ళ పేరయ్యలకు యీ వార్త కాస్తా చెవిన వేశారు. ఇంకే ముంది హౌసు కంట్రోలు ఆఫీసులో ఖాళీయిళ్ళ ఎడ్రసుల్లాగ జాతకాల తోటీ ఫొటోలతోటీ ఎక్కడ లేని చిరునామాలూ కృష్ణమూర్తి యిల్లు వెతుక్కుంటూ వచ్చి చేరాయి. రాత్రి తొమ్మిదీ పదిగంటలదాకా, స్నేహితులనీ, క్లబ్బు లనీ సేవించి నాలుగైదుపత్రికలూసిగరెట్టు పాకెట్లూ చేతపట్టుకునియిల్లు చేరేసరికి కృష్ణమూర్తిని ఆహ్వానిస్తూ చక్కనిచుక్కల్లాంటి అమ్మాయిలు: ఆ ఫొటోలు తనగదిలోకి తీసుకొనిపోయి కూర్చొనేవాడు. అన్నం దగ్గిర తల్లి ప్రశ్నలకి సమాధానంగా నవ్వేశేవాడు. ఏరా నాయనా తెనాలిపిల్ల ఎంతచక్కగావుందో చూశావా?



రచయిత్రి : శ్రీమతి కె. రామలక్ష్మి

ఆ గుంటూరు అమ్మాయికి యూనివర్శిటీవాళ్ళు పతకాన్ని బహూకరించారటరా!: ఆ మూడో ఫొటో నాకేమంత నచ్చలేదురా. ఓ ఆకెక్కువ చదివిన పిల్ల మనకెందులే; తోచినంతవరకూ అలాచెప్పుకుపోవడంఆవిడకిఅలవాటు. భోజనం ముగిసేదాకా కృష్ణమూర్తిదృష్టి యింకోదానిమీద పడదు. అమ్మా, యీ ఫొటోలన్నీ ఎలా వస్తున్నాయి మనకి? కొడుకు ప్రశ్నకి ఆవిడ నవ్వేరు. అదేంవిడ్డూరంరా, పెళ్ళికెదిగిన కుర్రాడుంటే ఆడపిల్ల తండ్రులు కళ్ళుపడవుట్రా? "అయితే సరేకాని నన్నిలాఫొటోలతో వేధించకు, ఏ యిద్దర్నో ముగ్గుర్నో చూసి తర్వాత ముడి పెట్టుకోవచ్చు" అనేసి భోజనం ముగించి వెళ్ళిపోయాడు ఆవేళ కృష్ణమూర్తి. పెళ్ళి అంటే యింత సులభంగా తీసుకున్న కొడుకుని చూసి తల్లి నవ్వుకుంది. చక్కగాచదువుకున్న అందమైన అమ్మాయి కోడలుగా వస్తే యీ చులకన భావం ఏమవుతుందో కదా! అనుకుంది.

కృష్ణమూర్తి కుడిభుజం జగన్నాథం. హైస్కూలు దగ్గిరనుంచీ సహపాఠులు, అంతకన్నా కూడా సన్ని

హితులయిన స్నేహితులు. ఆస్తిపాస్తులుండి దేనికీ అడ్డు చెప్పని తల్లివున్న కృష్ణమూర్తికి జగ్గాయి అణకువ చూస్తే లోకువ; కాని అధోవిధం అయిన గౌరవంకూడా లేక పోలేదు. అందుకే తన నిశ్చయాలని జగ్గాయి ఒప్పందానికి పెట్టే అలవాటయింది. "ఈ పెళ్ళి కూతుళ్ళ వరద నుండి ఎలాగురా తప్పించుకోవడం?" అంటూ ఒకనాటి మధ్యాహ్నంవేళ జగ్గాయి యింటిమీదికి దాడిచేశాడు. జగన్నాధానికి వేళాకోళం చేయబుద్ధివేసింది. "నీ ముఖం; ఒక్కొక్కళ్ళనే వెళ్ళిచూడు. ఏదో ఒంకపెట్టి చక్కారా" దానికి పెద్ద గొడవెందుకూ?" అన్నాడు. "చదువుకున్న అమ్మాయిలని యిలా చూసి చక్కావస్తే...నాలుగు తిట్టరుట్రా" అడిగాడు కృష్ణమూర్తి. ఇంతేనా తెలిసిందీ! ఎంతచదువుకున్నా అమ్మాయిలమ్మాయిలే — సాక్షాత్తు పట్టా పుచ్చుకున్న నా చెల్లెల్ని చూడు అంతకంటే ఏ పల్లెటూరిపిల్లేనా నయం!" అయితే ఒసారి ఆ అమ్మాయిని చూణ్ణీ"అనేసి నాలిక్కరుచుకున్నాడు కష్ణమూర్తి. నిజమే మరి అందరమ్మాయిలవిషయంలాగా స్నేహితుడి చెల్లెలి విషయంలో ప్రవర్తిస్తే వీపు పగులుతుంది. "ఫరవాలేదురా కృష్ణా, కొంచెం అలాంటి గడుగ్గాయేలే మా పార్వతి. చూద్దువు గాని పట్నంలోవుండి కాలేజీ చదువు వెగిలిస్తూంది — మా మామయ్య ఉన్నాడులే ఆడపిల్లల చదువంటే చెవికోసుకుంటాడు" సముదాయించాడుజగన్నాధం "అఘోరించాడు అయితే కొడుక్కూనీ వున్నాడా ఆ మామకి?" కుతూహలంతో ప్రశ్నించాడు కృష్ణమూర్తి. "లేడోయ్ పిల్లలేలేరు అందుకే. ఏంఅలా అడిగావు?" జగన్నాధం ప్రశ్నకి సమాధానం ఏమిటి? చూడనిపార్వతిని తనుఅప్పుడే ప్రేమించేస్తున్నానని ఎలాగ చెప్పడం?

"ఒరేయ్ జగ్గా, అమ్మకోసం అయినా వెళ్ళి రెండు సంబంధాలు చూసిరావాలి. నువ్వుకూడా రాకూడాదూ? ఓ వారం సరదాగా తిరిగివద్దాం" "చంపేశావు! అనూరాధకి యిందుకు వెడుతున్నాం అనితెలిస్తే నిన్నూ నన్నూ కలిపి తిడుతుంది. అయినా ఒక్కరోజు పోయివచ్చిరా నేనెందుకూ" అన్నాడు జగ్గాయి.

"ఎవరా అనూరాధ?" మిగిలిన విషయాలు వినిపించుకోనట్టే అడిగాడు కృష్ణమూర్తి. "నా యింకో మేనమామ కూతురులే. ఎప్పటికేనా నాభార్యఅవుతుంది" ముక్తసరిగా సమాధానం చెప్పాడు. "అఘోరించావు నాకూ ఓ మేనమామవున్నా బాగుండును"విసుక్కున్నాడు కృష్ణమూర్తి.

ఓవారం రోజులు గడిచాయి కృష్ణమూర్తి యింటికి వెళ్ళిచూస్తే తాళం వేసివుంది. మళ్ళీ యింకో నాలుగైదు రోజులుపోయాక వెళ్ళిచూస్తే కృష్ణమూర్తి తల్లివున్నారు. ఆత్రంగా జగన్నాధం అడిగాడు. ఏమండీ, కృష్ణ రాలేదా? అని. కూర్చోనాయనా అని కొంచెం టిఫినూ కాఫీ పెట్టి పెళ్ళికూతురు చూపుల ముచ్చట్లు చెప్పడం ప్రారంభించింది. "నాయినా, నీ స్నేహితుడు కదా. నీ అంతటి యోగ్యుడూ అయేలాచూడలేవూ? పట్నంనుంచి ముగ్గురు పిల్లల తండ్రులు కోరారు రమ్మని. వారం రోజుల్లో ముగ్గుర్నీ చూశాం. ఒక్కత్తేనా సవ్యంగా వుంటేనా?... చదువుకుంటే మటుకు ఒక్కర్తెకికూడా మంచీ మర్యాద తెలియదు అవ్వ! చెప్పుకుంటేకూడా సిగ్గు. ఓ అమ్మాయి ప్రశ్నలు వేసి అబ్బాయి నిలా నించోపెట్టేసిం దంటే నమ్ము!... అయితే నీపెళ్ళి ప్రయత్నా లెప్పుడోయ్?" అమ్మయ్య అనుకున్నాడు జగన్నాధం. లేకపోతే సంతలో వస్తులను విలువచేసినట్లు వెధవ పశ్నలూ వీళ్ళూ. — ఆ అమ్మాయి ఎవరో కాని మంచిపనిచేసింది. అనుకున్నాడు "నాకంత వెతక వలసిన పనిలేదండీ. మేనరికం వుంది. అయితే కృష్ణ ఎప్పుడువస్తాడూ?" "ఏం చెప్పమంటావు నాయనా. మద్రాసులోరేసులు అయిపోగానేవస్తాను నువ్వు వెళ్ళు అన్నాడు" అంటూ ముసలి తల్లి నిట్టూరుస్తూంటే, ప్రాణం కొట్టుకుంది జగన్నాధానికి. అందుకే కాబోలు కొడుకుని అదుపులో పెట్టే కోడలు కావాలని తపించిపోతోంది ముసలిప్రాణం అనుకున్నాడు వస్తానండీ. మళ్ళీ వస్తాను అనేసి గబగబ యిల్లుదాటి వెళ్ళిపోయాడు. నడుస్తున్నాడన్నమాటేగాని తన అదృష్టానికి తన హృదయం ఆనందంతో తడబడుతూంటే అడుగులు గబ గబ పడడం లేదు. అనూరాధని పొందడం గమ్యంగా చదువు సంధ్యలు శ్రద్ధగా ముగించాడు. అనూరాధ సుఖంగావుండడానికి యిప్పుడు ఉద్యోగం చేస్తున్నాడు. దీంట్లో స్వార్థం లేకపోలేదు. అయితే మటుకు ఎదటి వాళ్ళకోసం అనుకుంటే తృప్తి. ఇంటికి వెళ్ళగానే కలం కాగితం తీసి అనూరాధకి ఉత్తరం రాయాలని నిశ్చయించుకున్నాడు.

ఓనాలుగు రోజులతరువాత కృష్ణమూర్తి పట్నం విశే

షాలతో ఉప్పొంగిపోతూ జగన్నాధం యింటికి వచ్చాడు. కుర్చీలు ఒక వారకు నెట్టేసి వున్నాయి. లోపల గది గుమ్మంలో బిందె చెంబూ ఫినాయిలు సీసా చీపురూ, మెట్లెక్కి హాల్లోకి తొంగి చూశాడు కృష్ణమూర్తి. స్తబ్దుడయి వెనక్కి ఓఅడుగు వేశాడు. ఊపిరి గట్టిగా పీల్చుకున్నాడు. గట్టిగా జగన్నాధాన్ని కేకేద్దామా? పోనీ ఓ క్షణం ఓపికపట్టితే యీ సుందరాంగి యిటు చూడదంటావా? ఆవిణ్ణేపిలిచి అడిగితే?.... ఒక్కసారి మళ్ళీచూస్తే? చూడమని హృదయం ముందుకి తోస్తూంది. ఏమరిఉన్న సుందరాంగులని వారికి తెలియకుండా చూడడం సభ్యతా లక్షణం కాదని మెదడు హెచ్చరిక. ఏమయితేనేం? లోపలికి ఒక అడుగువేస్తూనే జగ్గాయి అనికేకవేశాడు. ఆమెను చూసినట్టూ అవుతుంది. జగన్నాథాన్ని పిలిచినట్టూ అవుతుందని నమ్మకం. ఎవరూ? అంటూ రెండడుగులు ముందుకి వచ్చింది సుందరాంగి. చేతిలో బూజులుదులిపే కర్ర. చేతులకి గాజులూ ఏంలేవు. చిరిగిపోవడానికి సిద్ధంగావున్న పాతరపిక నాటు నాగరికతా సృష్టి. కొత్తరకం అజంతా స్టయిలు జుట్టుముడి చక్కటి కొప్పు. నిద్రలేచి అద్దం చూసుకోలేదేమో అనిపించే కళ్ళకాటుక— దరిదాపు ముఖాన్నే ఆక్రమించుకుంది. చీర కుచ్చెళ్ళన్నీ జాగ్రత్తగా ఎత్తి నడుంమీద దోపింది. దంతంలా మెరిసే పిక్కలూ నాజూకైన పాదాలూ చూడ్డానికి చక్కగా వున్నాయి. నిలువెల్లా ప్రశ్నార్థకంలా వుంది. అలా చూస్తూనేవున్న కృష్ణమూర్తికి హఠాత్తుగా తెలివివచ్చింది. "జగన్నాధం వున్నాడాండీ" అడిగాడు. చిరుకోపంతో ముఖం చిట్లిస్తూ చేతిలోని బూజులకర్ర గదిలో ఒకమూలపెట్టి చీర కుచ్చెళ్ళు క్రిందికిదించింది. కాని ఆ రవికేచీరా ఏంచేస్తుంది? కొప్పు యిప్పటి కిప్పుడు యిప్పి సరిచేసుకుంటే బాగుంటుందా? మహాఁ యీయనెవడు కోన్‌కిస్కాగాడు హుఁ అనుకుంది. "అయితె జగ్గాయి అనిపిలిచి కొద్దినిమిషాలపాటు అలా నిలిచిపోయిన గొంతు మీదేనా?" అడిగింది. లేని నవ్వు తెచ్చుకుంటూ "అవునండీ, పాపం ఏదో పనిలో వున్నారనీ" నమిలే కృష్ణమూర్తిని పరీక్షగా చూస్తూంది. ఇంతట్లోనే చిన్న తుఫానులా మేడమీద నుంచి యింకో సుందరాంగి దిగింది. సగంచీర తడిసింది. ముఖాన చెమటలు కమ్ముకొని వున్నాయి. కష్టపడి పనిచేసినట్లు ఒగరుస్తూ ఒక్క పరుగున క్రిందికి వచ్చి గండు పిల్లిలా మాటా మంతీ లేకుండా ఒకరి నొకరు చూస్తూ గుమ్మాని కవతల నించున్న అబ్బాయినీ యివతల నుంచున్న పార్వతినీ చూసి ఆగింది. అనూరాధ. "ఏమిటే పారూ, అలా హిప్నాటైజ్ చేస్తున్నట్లున్నావు?" తనరాకను తెలియచెప్తూ ప్రశ్నించింది రాధ. అందరికీ వినిపించేలా 'హమ్మయ్య' అన్నాడు కృష్ణమూర్తి. రాధే ముందరికి వస్తూ, సారీ, రండి, యిల్లూ అదీ కొంచెం కడుక్కుంటున్నాం. మీకెవరు కావాలి? అడిగింది. జగన్నాధం కోసం వచ్చాను. నాపేరు కృష్ణమూర్తి అయితే ఆవిడ పార్వతిగారా? అడిగాడు కొంటెగా పార్వతిని చూస్తూ "అవునండీ ఆవిడే పార్వతి నా ఆడబొడుచు" అంది నవ్వుతూ అయితే మీరు అనూరాధగారు అవునా? అడిగాడు కృష్ణమూర్తి. పార్వతి కిప్పటికి తోచింది. తాను సంభాషణలో పాల్గొనడం లేదని.... అవునండీ, అవును, యిక్కడ ఒకరికి తెలియని యింకొకరు లేరు. మా అన్నయ్య ధర్మమా - అంటూ రండి కూర్చుందాం. అని పక్కకి నెట్టేసిన కుర్చీలు ముందుకి లాగింది. సగం బూజులతో దుమ్ముతో నిండిన ఆగది నందనవనంలా వుంది కృష్ణమూర్తికి. జగన్నాధానికి యింత చక్కటి చెల్లెలుందని తన కెందుకు తెలియలేదు? అలాతెలిస్తే జగన్నాధం దగ్గిర కొంచెం జాగ్రత్తగా ప్రవర్తించే వాడే తను! (అంటె తను పేక ఆడతాననీ, బైనులా పొగవిడుస్తాననీ యింకా యింకా ఎన్నో తెలియనివ్వక పోదునే) యిప్పుడు ఒకవేళ తనలోట్లు తెలిసిన జగ్గాయి చెల్లెలికి తను తగనంటే తనకి తెలియకుండానే మెదడు ఆలోచించేస్తూంది. కృష్ణమూర్తి హఠాత్తుగా యిలా వుండడం చూసి పార్వతి అడిగింది. "ఏమండీ మద్రాసు వెళ్ళేరుట. ఎవరేనా నచ్చేరా?" రాధ నవ్వింది. కృష్ణమూర్తి జేబుతడివి సిగరెట్టు తీసి వెలిగించాడు. 'మా అమ్మపోరు పడలేక వెళ్ళానండీ' యింకా ఏదో చెప్పబోతూంటేనే పార్వతి అందుకుంది. అయితే మీ అమ్మగారు అడగమంటేనే అడిగారా అన్ని ప్రశ్నలు సరళని? అన్ని ప్రశ్నలు వేసిన సరోజకి బదులు చెప్పొద్దన్నారా?" "కృష్ణమూర్తి గట్టిగా నవ్వేడు. ఇవన్నీ మీదాకా రావడం నాకెంతో సంతోషంగా వుంది. రాధగారూ కొంచెం మంచినీళ్ళు యిస్తారా?" రాధ లేచి లోపలికి వెళ్ళింది. "చూడండి పార్వతిగారు. ఇన్ని తెలిసిన నన్ను మీరు మన్నించి మా యిల్లు పావనం చెయ్య

మని కోరుతున్నాను." పార్వతి చేయి తన చేతిలోకి తీసుకున్నాడు కృష్ణమూర్తి. ఒక్కసారి విదిలించుకుని లేచింది పార్వతి. "మరి నాకు యూనివర్శిటీలో క్లాసురాదు. వంట చెయ్యడం సరిగారాదు. అన్నిటికంటే ముఖ్యం మొద్దబ్బాయిల్లాంటి మొగవాళ్ళని చూసివూరుకోవడం అసలే రాదు." అంది చిన్న నవ్వునవ్వుతూ "ఫరవాలేదు. ధైర్యేసాహసే లక్ష్మి అన్నారు కదా పెద్దలు అన్నిటికీ సిద్దపడే మిమ్మల్ని కోరుతున్నాను. మీరు ఊ అంటే జగ్గాయిని యిట్టే ఒప్పిస్తాను." పార్వతి ఏదో ఆలోచనలో పడి అలాగే కృష్ణమూర్తి ముఖంవైపు చూస్తువుండి పోయింది. ఆత్రంగా ఎదురు చూస్తున్నాడు ఆవిడ సమాధానం కోసం కృష్ణమూర్తి. వెనకనుంచి నీళ్ళుపట్టుకు వచ్చిన రాధ గుమ్మం మెట్లెక్కుతున్న జగ్గాయి యీ దృశ్యం చూసి ఆశ్చర్యపడ్డారు. ముందరికి వచ్చి ప్రేమగా కృష్ణమూర్తి భుజం మీద చెయ్యి వేస్తూ జగ్గాయి అన్నాడు. "ఏమిటే పారూ మా వాణ్ణి అలా భయపెట్టేస్తున్నావు. అసలే మొన్న మద్రాసు వెళ్ళి దడుసుకున్నాడు" అనేదాకా ఎవరికీ తెలివి లేదు. అందరూ ఒక్కసారి నవ్వేశారు. పార్వతి పల్చటి చెక్కిళ్ళు ఎర్రపడ్డాయి. అలుముకున్న కాటుక నలుపులో ఆ నునుసిగ్గుల ఎరుపులు ఎవరికీ కన్పించలేదు. తిరిగి జగ్గాయే అన్నాడు "పో, పార్వతీ ఆ తల దువ్వుకునిరా. అసలే వీడు ఎలిజబుల్ బ్రహ్మచారి!" 'ఫరవా లేదురా జగ్గాయి' అన్నాడు కృష్ణమూర్తి. "ముందర అలాగే అంటారు. పో, పారూ" అని సముదాయింపు స్వరంతో రాధ అనేసరికి పార్వతి ఒక్కగెంతులో మేడ ఎక్కింది చిలిపిగా రాధకేసి చూసి నవ్వేడు జగ్గాయి "నే వెళ్ళి మా అమ్మని పంపిస్తానురా ఒకసారి. నీకేమైనా అభ్యంతరాలుంటే చెప్పునాకు మీపార్వతిని చేసుకోవాలనివుంది." అడిగాడు కృష్ణ. జగ్గాయికి ఒక్కసారి ఎక్కడలేని అభిమానమూ ప్రేమా, జాలీ, అన్నీ ఉప్పొంగేసరికి గొంతుక పూడుక పోయింది "చూడు కృష్ణా మన స్నేహం దీనికి దారితీస్తుందని ఎప్పుడో అనుకున్నాను. పార్వతి సుఖ దుఃఖాలు నా భుజాలమీద పెట్టి అమ్మా నాన్నా కన్ను మూశారు. ఆ భారం నీలాంటివాడి నెత్తిన హాయిగా పెట్టగలను కృష్ణా. ఆసంగతేనా పార్వతిని అడిగావు?" సిగ్గుపడుతూ అవునన్నాడు కృష్ణమూర్తి. అమాంతంగా స్నేహితుణ్ణి కౌగలించు కొన్నాడు జగన్నాధం.

సిగరెట్టు వెలిగించుకుంటూ మెట్లు దిగుతున్న కృష్ణమూర్తిని మేడమీది కిటికిలోంచి చూసింది పార్వతి. "ఇదిగో మిమ్మల్నే సరే అన్నానని చెప్తారా మీ అమ్మతో అని కేకే వేసింది. పైకి చూశాడు. విప్పారినకళ్ళతో పైకి చూస్తున్న కృష్ణమూర్తి ముఖంలో చిరునవ్వు వెలసింది. పసివాడి బోసినవ్వులా అమాయికంగా వున్న ఆ ముఖాన్ని చూసి వెక్కిరించింది పార్వతి. హఠాత్తుగాలోపలికి తిరిగి మేడమీదకి వెడుతూ వంటయింట్లోకి తొంగి చూశాడు. కృష్ణమూర్తి. అనూరాధని కౌగిటచేర్చుకుని తన్మయదశలో వున్న జగ్గాయిని చూసి గబగబ మెట్లెక్కి పార్వతిముందర వాలేడు. నిజంగానా పార్వతీ ... నేను చాలా చెడ్డవాణ్ణి. నాకు అసూయ ఎక్కువ. నన్ను నిజంగా ప్రేమించకలవా పార్వతీ? అంటూ ఆమెచేతులు తన చేత తీసుకున్నాడు. ప్రేమించ కలగడమేమిటి అబ్బాయీ, నిన్ను గురించి నాకు కంఠతా తెలుసు. కృష్ణా నీ కోసం ప్రత్యేకించాను యీ మొండిఘటాన్ని సరా? యింకవెళ్ళు వాళ్ళు చూస్తే బాగుండదు. ' వాళ్ళంతచూసే స్థితిలో లేములే అంటూ పార్వతిని హృదయానికి హత్తుకుని క్షణంలోకోట్లమైళ్ళు ప్రయాణం చేయించాడు మనస్సుని. క్రిందికి దిగివస్తూంటే మెట్ల దగ్గిర అనూరాధ నిల్చుని వుంది. కృష్ణమూర్తిని చూడగానే నవ్వుతూ, ఎవరూ లేకుండా ఏందోచు కొండామనండీ ఇదిగో పెళ్ళి నాటిదాకా యీ బహుమతి దాచలేను ఇంటికి తీసుకువెళ్ళి మీ అమ్మగారికి ముటుకు చూపకండి అంటూ ఒక కవరు అందించింది. దారిలోనే దాన్ని యిప్పి చూశాడు. పార్వతి ఫొటో. వెనకకి తిప్పిచూశాడు "సర్వసామాన్యంగా మాపారూ ఇంట్లోఇలాగేవుంటుంది" అనూరాధ. "అని రాసివుంది. నవ్వుకుంటూ జేబులో పెట్టుకున్నాడు. ఏరోజు ఉదయాన బూజుల కర్రతో పార్వతి సాక్షాత్కరించిందో యించు మించు అలాంటి పోజులోనే వుంది యీ ఫొటో. ఇంటికి వెళ్ళి అమ్మకి చూపిస్తే! అనుకున్నాడు కృష్ణమూర్తి.

అనుకున్నట్లు కొద్ది మాసాల లోనే కృష్ణమూర్తి గృహాన్ని పావనంచేసింది పార్వతి. చదువుకున్న కోడలు కావాలని కలలు కన్న ముసలామె కోరికా తీరింది చదువుకున్న పిల్లలంటే దడుసుకుని మద్రాసునుంచి వచ్చేసిన కృష్ణమూర్తికి చదువుకున్న నాటునాగరికతారాణీదొరికింది.